# ఎదురుచూడని విపరీతం

**శ్రీ పంచకర్ల రామమోహనరావు**

చల్లగా గాలి వీస్తూవుంది. నా మనస్సు ఎంతో ఉల్లాసంగా వుంది. గడియారం చూస్తే టైము ఐదు అయింది. ఎంతకూ కాలం గడవడము లేదు. క్షణం ఒక యుగంలాగా వుంది. ఆ ఆరాటం మరి నిన్న లేదే! ఎందుకుంటుంది? నిన్నటిరోజు శనివారం. మరి ఈ రోజు ఆదివారం. అందులోనూ అందరికీ శెలవురోజు. రోజూటి పేర్లలో మార్పు. ఆ మార్పుతో పాటు పని చేయడంలో తేడా వస్తూవున్నప్పుడు రోజులు గడుస్తూన్నకొద్దీ రోజుల మారటంలో వింత ఏముంది? రోజుతోపాటు మనస్సు మారుతుంది. మమకారం కూడా మారుతుంది. రాత్రి పది గంటలు ఎప్పు డవుతుంది! పది గంటలు అసలు ఎందుకు కావాలి! నిద్రాదేవత కౌగిలిలోకి వెళ్ళటానికా? ఇలలోక స్వర్గంలో విహరించటానికా? బ్రతుకు తెరువు బాటలలో గులాబీలు వెదజల్లడానికా? మోహం పొంగి, లోకం తెలియని ఒక జవరాలి హృదయంలో అమృతం కురిపిస్తానికా? అమృతం హాలాహలంగా మారుతుందేమో! అది విపరీతానికి దారి తీస్తుందేమో! ఆ విపరీతం నా జీవితంలో అంతులేని ఒక అగాధంగా తయారవుతుందేమో! ఆ బాధ అంతా ఒక కన్నీటి గాథగా సువర్ణాక్షరాలతో లిఖింపబడి లోకంలో చిరస్థాయిగా నిలిచిపోతుందేమో! లిఖింపబడిన ఆ ప్రణయగాథను ప్రేక్షకుల కందించటానికి కొందరు దర్శకులు ముందంజవేసి చలనచిత్రంగా తీస్తారేమో! ఈ విచిత్రమైన ఆలోచనలు నాకు విస్మయాన్ని కలిగించినాయి. ఈ విశ్వమంతా ప్రేమమయం. ప్రేమ ప్రక్కనే పాషాణం ఉందే! పాషాణం నుంచి ప్రేమను విడదీయటానికి ఎంత తెలివితేటలు కావాలి! ఎంత నాటకచక్రం, హృదయ ధైర్యం కావాలి! మరి అవి అన్నీ నాకు ఉన్నాయా? ఈ న్యాయమునకే కార్యరంగంలోకి దిగాలి. ఆమాత్రం ఆత్మవిశ్వాసం లేనిదే ఏపని చేయగలం? ఏమనుకుంటూ ఇక్కడికి వచ్చాను? ఏం జరిగింది? ఏమి జరగబోతూ ఉంది? నేను ఇక్కడికి రాకపోతే ఏమి జరిగేది? అంతా ఎదురుచూడని విపరీతంలాగా కనబడింది నాకు. ఇప్పుడు టైము ఎంతయింది? ఆరు గంటలేనా! అయ్యో! ఇంకా నాలుగు గంటలు గడవాలా? అంటే రెండువందల నలభై నిముషాలు! అంటే పద్నాలుగువేల నాలుగువందల సెకండ్లు!! అబ్బ ఎంత కష్టం! ఇంతవరకు ఇరవైఒక్క వసంతాలు చూశానే! కాని ఇప్పుడు నాలుగు గంటల కాలం గడపటం కష్టమైపోయిందే! ఎంత విచిత్రం!


మళ్ళీ నాకు అనేక ఆలోచనలు కలిగాయి. ఈసారి నా ఆత్మ, హృదయం నాలోని ప్రతి అణువూ తీవ్రంగా ఆలోచించసాగాయి. నేను నిజంగా ఎక్కడున్నాను? ఇది స్వర్గలోకమా! లేక మానవలోకమా! నిద్రలో ఉన్నానా? కలలుగంటున్నానా? ఒక్కసారి నన్ను నేను గిల్లుకున్నాను. చేతిమీది స్పర్శనాడులు మెదడుకు ఈ వార్తను కొనిపోయాయి. మెదడు కండ్లను ఆదేశించింది ఎవరో చేతిని హింసిస్తున్నారు చూడమని. కండ్లు చూచి ఒక్కసారిగా నవ్వాయి. ఎవరో అంటూ వేమిటి? పిచ్చిదానా! ఎడమచేతిని కుడిచేయి గిల్లింది; ఆమాత్రం నీకు తెలియలా? మెదడు ఫక్కున నవ్వింది. నాతో మెల్లగా చెప్పింది: 'నీవు బ్రతికే ఉన్నావని.' ఇది కల కాదు సుమా! నిజం! నిజం!! అని హెచ్చరించింది.

ఏలూరు ఇది. నీవు ఏలూరు కాలవగట్టున కూర్చున్నావు. చూడు అవతలి ప్రక్క గట్టుమీద పొదలపై పిట్టలు. ఏమిటా కిచకిచ ధ్వనులు! రాత్రి పది గంటలకు వలపు విరజిమ్మే సొగసు ఎదలోంచి వెదజల్లే కిలకిల నవ్వులేనా? లేక ముకుళించుకున్న హృదయంలోనుంచి కనుకొలకుల గుండా కన్నీటిప్రవాహంగా వలపు విలపిస్తుందా? చంద్రుని చూచి కలువలు వికసిస్తాయా? సూర్యుని చూసా? ఇప్పుడు నేనెవరిని? చంద్రుని కాను. సూర్యుని కాను. ఇరువదిఒక్క వసంతాల ప్రాయపు మోహన్‌ను. ముద్దుగా మిత్రులందరూ 'మోహ్గాను' అని పిలుస్తారు. మరి ఆ జవ్వని నన్ను ఏమని పిలుస్తుంది? నేనిప్పుడు నటించాలి. ఎంతో సామర్థ్యంతో నటించాలి. ఆ సొగసు గిలిగింతలు పెట్టాలి. ప్రేమింపచేయాలి. వలపింపు చేయాలి. రంజింపచేయాలి. చివరికి ఏమవుతుందో ఏమో! లోకం తెలియని పసిపిల్ల, ఎదురు తిరిగిన రక్కసితో లను, హృదయానికి జవాబు చెప్పలేని అబల. బాల్య చాపల్యంతో భయంవీడి విచ్చలవిడిగా తోటలో సంచరిస్తూ మసలుతున్న లేడిపిల్ల. ఆ రోజున ఆమె సీటులమీద ఎదురుగా కూర్చుంటే ఆ కాటుక పెట్టిన కండ్లు ఎట్లా మెరిసాయి! ఆ క్రింది ఎర్రటి పెదవి ఎట్లా ఒణికింది! ఆమె చేతివేళ్ళు ఎంత కోమలంగా పొడుగ్గా వున్నాయి!

ఆ గోళ్ళకు గోరింటాకు పెట్టిందా? రంగు పూసిందా? ఆ తలవంచుకుని కూర్చున్న ఆ సుందరాంగి నాదే! శాశ్వతంగా నాదే! మరి ఏమిటీ విపరీతం ఈనాడు. ఏమిటీ కాలప్రవాహానికి ఎదురీత! ఆ భగవంతుని దూషించాలా? భూషించాలా? కృతజ్ఞత తెలపాలా? వందనాలు అర్పించాలా? ఇప్పటికి మాత్రం ఆ దేవుని భూషిస్తాను, కృతజ్ఞత తెలుపుకుంటాను. వందనాలు అర్పిస్తాను. నేను గాని ఇక్కడకు విజయవాడనుంచి రాకుండా వుంటే నిజంగా దేవుని దూషించేవాడినే. అట్లా ఎందుకనో నా హృదయం అంటూవుంది.

నాకు గడియారంమీద అమితంగా కోపం వచ్చింది. చిన్న ముల్లును ఒక్కసారి అమాంతంగా పదిమీదకు తిప్పేస్తానా అనుకున్నా. నేనైతే తిప్పి వేద్దును. ఈ ఆలోచన కూడా ఆ మెకు ఒకేసారి తట్టాలిగా! ఆ మెకు తట్టకపోయినా నాకోసం తపస్సు చేస్తూ వుంటుందని నా నమ్మకం. అబ్బ ఎంత గందరగోళం అవుతూవుంది నా మనస్సు. నేను విజయవాడలోనే వుంటే ఎంత విపరీతం జరిగేది! ఆలోచిస్తూ, ఆలోచిస్తూ వుంటే నాకున్న కాస్త మతి ఇక్కడే పోయేటట్లు ఉంది. నిజంగా ఆమె అట్లాంటిదేనా? కాదు. కాదు. అవునని హృదయం నొక్కి వక్కాణిస్తూ వుంటే ఆత్మారాముడు అసలు ఒప్పుకోడే! నిజంగా ఆమెలో ఉప్పొంగిన ఉడుకు రక్తం అట్లా చేయించి వుంటుంది. మిసమిసలాడే పడుచు నాతెంఢ్ర యౌవనప్రాగల్భ్యం ఆమెను అట్లా మాయ చేసి ఉంటుంది. ఆమె ఈ దేశంలో కండ్లు మూతలుపడి అట్లా చేసి వుంటుంది. అయినా అన్యమూ పుణ్యమూ ఎరుగదు.

నల్లనివి నీళ్ళు, తెల్లనివి పాలని నమ్మే ముగ్ధ. అయినా ఆమె క్షంతవ్యురాలు. ఆమెది తప్పు కాదు. తప్పు ఆ నేరం నిజంగా ఉంటే అదంతా తప్పిదం నాదే. అందుకే నేను క్షమిస్తున్నానుగా! అట్లాగే గంటలు వేదనతో



"అక్కడికి ఇక ఆపండి" అంది సరోజ

ఆవేదనతో గడిపా. ఒక్కసారి భగవంతుని ప్రార్థించాను. ఆయన దీవనలు ఈ స్థితిలో ఎంతో అవసరం. ఏం జరుగుతుందో ఏమో! ఏం జరిగినా విపరీతం జరుగకూడదు. కాని నాకు ఎదురుదమ దని విపరీతమే గా ఇది మరి! గడియారంవంక చూశాను. ఇరవై నిముషాలు తక్కువ పది. నాకు కావలసిన రాత్రి పది గంటలకు ఇరవై నిముషాలు తక్కువ వున్నమాట. ఆ సుఖసమయానికి ఎదురుచూచే నా హృదయానికి ఆ ఇరవై నిముషాలు మాత్రం తక్కువ కాలమంటారా? మీరు నా పరిస్థితిలో వుంటే అలా అనరు. దిల్‌ఖుష్ వేయించుకొని కిళ్ళీ కట్టించుకొని నములుతూ ఆమె ఇంటి వెనుక నున్న చిన్న తోటవైపు నడుస్తున్నా. తోట వెనుకవైపు యున్న దొడ్డి గుమ్మపు తలుపు వేసివుంది. ఇంకా ఐదు నిమిషాలు ఉన్నాయిగా పది కావటానికి అందుకని ఆమె తలుపు తెరవలేదనుకుంటాను. అసలు తోటలో ఎవరైనా ఉన్నారో లేదో చూడాలని బుద్ధిపుట్టింది. గోడమీద చేతులు వేసి ఒక్క ఎగురు ఎగిరి లోపలికి చూచాను. ఆ అమ్మాయి ఉంది. దొడ్డిగుమ్మం దగర తొందరగా అటూ ఇటూ పచార్లుచేస్తూ ఉంది. అంత తొందరేమిటో నాకు అర్థం కాలేదు. నా రాకకై నిరీక్షణలో అంత ఆతురతపడుతూవుందా? లేక ఆలోచనా నిమగ్నురాలై అదుర్దాగా అటూ ఇటూ తిరుగుతూ ఉందా? ఏమో! ఆమె హృదయం ఎవరికెరుక? చల్లకొచ్చి ముంత దాచటమెందుకు? ఐదు నిముషాలు ఉంటే మాత్రమేమిటి? రెండు నిండు హృదయాల కలవరపాటుకు ఐదు నిముషాలు ఐదు యుగాలుగా తోయదూ! ఒక్కసారిగా నాలో భయం ఆవరించింది. ఎందుకంటే నేనేమి చెప్పగలను? ఎందుకో ఏమో!

నిలకడలేని అప్పటి నా మనస్సును నిలువద్రొక్కుకున్నా. ఆమెతో జాగ్రత్తగా మెలగాలి లేకపోతే ఏమౌతుంది? తలుపు కొట్టాను. ముఖాన్ని ప్రక్కకు తిప్పుకొని ఎవరైనా వస్తున్నారేమో చూస్తున్నట్లుగా మంచున్నాను. ఆమె వచ్చింది. తలుపు తీసింది. తిరిగి నేను తలుపు మూసేసరికి ఆమె లోపలికి వెళ్ళుతూవుంది. గుమ్మందగ్గర చెట్ల నీడచే చీకటిగానే ఉంది. విదియ చంద్రుడు. పిండారబోసినట్లు వెన్నెల. పుష్పములు వికసించి సౌరభాన్ని వెదజల్లుతున్న పూతోట. అందులో తెల్లటి చీర సింగారించుకొని యౌవనగర్వంతో బిగిసిన అవయవాలతో కొంచెం నెమ్మదిగా నడుస్తున్న ఆమె నాకు రతీదేవివలె కనిపిస్తూ ఉంది. ఆమె పొడుగైన వాలుజడలోంచి గులాబీ పువ్వులు మజాగా నవ్వుతున్నాయి. నేనుమాత్రం ఈ స్థితిని కాలేదు. అప్రమత్తతతో ప్రవర్తిస్తే ఈ సమయంలో ఏదైనా విపరీతం జరుగవచ్చు. ఆమె వెనుక నడుస్తూవుంటం అంత మంచిది కాదని ముందుగా రెండడుగులు వేసి మాలతీ పొద వెనుక చీకటిగావున్న ప్రదేశంలో వెళ్ళి నిలబడ్డాను. ఆమె నన్ను అనుసరించింది. ఏమీ మాటాడలేదు. కాని నేను ఎంతో ఆశతో వచ్చాను. ఆ నిశ్శబ్ద నిశీథంలో ఆకులు గాలికి

కదల్లాడుతున్నాయి. నా నోటినుంచి మాట పెగలడం లేదు. నోరార్చుకుపోయింది. నోరార్చుకుపోదు మరీ! జీవితంలో ప్రప్రథమంగా పలకరించి, మాట్లాడించి ప్రసన్నురాలుగా చేసుకోవటం కాదూ మరీ!

నేను డ్రామాలలో బాగా నటిస్తానని అందరూ మెచ్చుకుంటారే! నా మిత్రులు 'నీ వొక్కడివు చాలురా మన బి. కాం. పరువు నిలబెట్టటానికి. అంతా వెధవలు. ఏ విషయంలోనూ పాలుపోవదు' అని నన్ను ఎంతగానో పొగుడుతారే! మరి ఆ నటనా చాతుర్యం ఏమయింది ఇప్పుడు. అది నాటకరంగ మాయె. ఇది జీవితరంగం కాదు మరి! అందుకే నేనా ఈ జంకు గొంకులు. ఆమె నాకు కొంచెం దూరంలో నిలబడివుంది. మూగనోము పట్టింది. నేనే పలకరించాలి కామోసు. క్రొత్తవారితో ప్రసంగంలోకి దిగాలంటే వాతావరణ ప్రసక్తిగా ముందు తెచ్చేది. ఎండ తీవ్రముగా వుందే, గాలి హాయిగా వుందే అనో మొదలు పెట్టాలి. ఇప్పుడో మరి! నేను కొంచెం గొంతుక సవరించుకున్నా. ఆమెవైపు చూడకుండానే "చూడు, వెన్నెల ఎంత బావుందో!" అన్నాను. ఆమె అట్లాగే నిలబడివుంది. సిగ్గుపడుతూ ఉందా? ఆలోచిస్తూ ఉందా? ఏమి ఆలోచిస్తుంది! మాటలు రావా? ఏమో ఆమె పలుకలేదు—ఉలుకలేదు. మళ్ళీ మొదలు పెట్టాను. "ఆశలు పెంచుకు వచ్చిన ప్రియునికి ఇదేనా నీవు నాకు చూపే సరసం. మాటలు రావా? అని ఎంతో ఆప్యాయంగా అడిగాను. ఆమెలో అప్పుడు సంచలనం కలిగింది. ఆ తియ్యటి కంఠం విప్పి చిలక పలుకులుగా మాటలు వచ్చు. కాని—"

ఆమె కంఠం వణికింది. ఆమె మాట్లాడిందిగా. నేను సంతోషం కనపర్చవద్దు మరీ! అందుకని ఆ 'కాని' పూర్తికాకుండానే "మీ నౌకరు గౌరి చాలా తెలివైంది. నన్ను చూడగనే నీవు పంపిన ఉత్తరం దాచివేయసాగింది. కాని నేను సంతోషంతో బలవంతంగా లాగుకొని ఐదు రూపాయలు చేతిలో పెట్టా. గౌరి ఉత్తరం నాకిచ్చినట్లు ఎవరికీ చెప్పనంది." ఆమె వింటూవుంది. కొంచెం కన్ను ప్రక్కకు త్రిప్పి చూచాను. చైతన్యం లేని బొమ్మలాగా కనబడింది. నేను కొంచెం ఆలోచనలో పడ్డాను. ఈమె ఇట్లా భయం భయంగా ఎడం ఎడంగా నడవటము, ఇప్పుడు కొంచెం దూరంగా నిలబడటమూ— ఇదంతా ఏమిటా అని. నామీద ఆమెకు అనురాగం లేదా? ఈ ఉత్తరం వ్రాయటంలో అర్థం'

నిజంగా గౌరికి నేనెంతో కృతజ్ఞుణ్ణి. మరి గౌరి ఈమెకు కృతఘ్నురాలు అవుతుందిగా? ఏమిటో ఇదంతా. అంతా విపరీతంగా ఉందే! మళ్ళీ నేను నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, "సరోజా! నీ అమృతహస్తంతో వ్రాసిన ప్రతి అక్షరం ముత్యంలాగా ఉంది. నీ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివినా నా ముచ్చట తీరలేదు. ఔను కాని ఏమిటీ మౌనం సరోజా, మనసు విప్పి మాట్లాడవే" అన్నాను. నేను పొదప్రక్క చీకటిలో నిలబడ్డాను. ఆమె కొంచెం దూరంగా ఉంది. ఆమె ముఖం మీద చెట్ల ఆకులగుండా వెన్నెల పడుతూవుంది. నేను ధీరునిలాగా నిలబడ్డాను. ఆమె ఏమిటో ఘోరంగా ఆలోచిస్తున్నట్లు వుంది. లేక అదంతా నటనా! కొంచెంసేపు ఆగి మళ్ళీ "ఎవరైనా వస్తారని భయమా? ఇప్పుడిక్కడికి ఎవరు వస్తారు!" అని కొంచెం నెమ్మదిగా అన్నాను. ఆమె బొంగురుపోయిన కంఠముతో "నన్ను క్షమించాలి—" అంటూ ఉండగనే మాటలు పూర్తి కానీయకుండా మళ్ళీ అడ్డుపడి "క్షమించటం ఎందుకు సరోజా! ఏమిటా మాటలు. ఆనందంగా వెన్నెలలో సౌఖ్య మనుభవించటానికి బదులు—"

ఆమె వినలేకపోయింది అనుకుంటాను. కటువుగా "అక్కడికి ఇక ఆపండి" అంది. నేను నిలువునా నీరైపోయాను. నాలోని జీవకళలు అన్నీ చచ్చిపోయినాయి. మనసారా వలచి, ప్రేమలేఖ వ్రాసి మెత్తమెత్తగా చీవాట్లు పెడితే ఎవరి ప్రాణం నీరు కాదు. అయితే నేనేమైనా గుణపాఠాన్ని నేర్చుకుంటానా? ఆడదానిముందు అంతగా భయపడితే ఎట్లా? అందుకనే లేచి గంభీరం తెచ్చుకొని "ఇక్కడికి రమ్మని ప్రేమతో ఎందుకు లేఖ వ్రాశావు. వచ్చిన తరువాత ఈ రాద్ధాంతమంతా ఏమిటి? గౌరికి ఐదు రూపాయలు కూడా ఇచ్చానే!" అన్నాను. ఆమె ఐదు రూపాయలన్నమాట మళ్ళీ నొక్కి "ఐదు కాదు, మీకు ఏభై రూపాయలు ఇస్తాను. దయచేసి నన్ను వదలి వెళ్ళండి" అంది దీనంగా. ఇంతకుముందు పురుషులకు రోజుకు రోజుకు మనస్సులు మారుతూ వుంటాయి అనుకున్నాను. కాని జవరాండ్రకు క్షణక్షణం మనసు మారుతుందని ఇప్పుడు సరోజ నిరూపించింది. ఈమెలో ఈ మార్పుకు కారణం ఏమిటి? ఆమె లోతైన హృదయం తెలిసికోవటం నా తరం కాదా? ఒక్కపెట్టున హేళనగా, చులకనగా నవ్వాను. ఆమె ఒంటరితనానికి, నాలోని గంభీరత్వానికి భయపడిపోయింది. ముల్లు వెళ్ళి అరటి ఆకు మీద పడినా, అరటిఆకు వెళ్ళి ముల్లుమీద పడినా జరిగేపని ఒకటేగా! అంతే ఆడదాని బ్రతుకు. నలుగురిలో నవ్వులపాలు అవుతుందేమో తన బ్రతుకని ఆమె నివ్వెరపోయి ఇక ప్రాధేయపడడం మొదలుపెట్టింది. "నన్ను మీరే కాపాడాలి. నా ఆత్మ నన్ను నిలువనీయటం లేదు. నేను వివాహితను. అది మీకు తెలుసు. ఒకరోజున మీరు కిటికీలో నే నుండగా రోడ్డు వెంట పోతూ చూచి నవ్వారు. ఆ నవ్వుముఖం చూస్తే నా భర్త జ్ఞాపకం వచ్చారు. రోజూ అనుకోకుండా అదే సమయానికి అక్కడ నిలబడిపోవటం అలవాటయింది. ఇవ్వాళ ఏ దుష్టశక్తులు నాలో పనిచేశాయో, నా కండ్లు ఎట్లా పొరలు కమ్మాయో ఏమో మీకు ఆ లేఖ వ్రాశాను. నన్ను క్షమించండి. పాపిష్టిదానను. నా భర్తకు నేను ద్రోహం చేయలేను" అని ఆమె వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది. నాలోని నరాలు అన్నీ పని చేస్తున్నాయి. మెదడువైపు రక్తం వేగంగా ప్రవహిస్తూవుంది. మళ్ళీ మనస్సును కుదుటపర్చుకొని "సరోజా! ఈ టక్కులు నా దగ్గర సాగవు. నీవు ఇప్పుడు నాదానివి. చేతి కందినది వదలుకోవటం చేతకానివాడి పని. కాని నీకు వచ్చే నష్టం ఏమీ లేదు. నిరాకరించావో నీ నాశనానికి నీవే కారకురాలు అవుతావు." మళ్ళీ కొంచెంసేపు ఆగి "నీవు చేసేపని తప్పు ఏమీ కాదు. వయస్సులోవున్న పిల్లను వివాహ అనంతరం భర్త ఆలింగనంనుండి వేరుచేయటం పెద్దల తప్పు" అన్నాను. ఆమె ఒక్కసారిగా రెండడుగులలో నా దగ్గరకు వచ్చి ముఖం ప్రక్కకు త్రిప్పియుండగా నా కాళ్ళు పట్టుకుంది. "శీలం నాశనం అయిన తరువాత శరీరానికి విలువ ఏముంది? నన్ను చంపండి. నరికండి. కాని నన్ను కన్యగా వదలిపెట్టండి" అని ఆమె కన్నీటితో నా పాదాలు కడుగుతూవుంది. ఇంతవరకు నా ముఖం దాచుకుంటూ నే వచ్చాను.

నన్ను చూస్తే ఏమవుతుంది? నా హృదయం ద్రవించింది. రెండు కన్నీటి బిందువులు ఆమె శిరస్సుమీద పడి దీవించాయి. నాకు ఒక్కసారిగా ఎందుకో ఆనందం కలిగింది. నా మనస్సు ఎంతగానో తేలిక అయింది.

ఒక స్త్రీని—అందులో శాశ్వతంగా నాదే అనుకున్న ఒక ఇల్లాలిని అర్థం చేసుకున్నాను అన్న గర్వం, ఇవన్నీ ఒక్కసారిగా పని చేశాయి. "నీకేం భయంలేదు సరోజా. నేను నిన్ను కాపాడుతాను" అని ఆమెను లేవనెత్తాను. కన్నీరు కాలువలు ఆమె గులాబీ చెక్కిళ్ళమీద ప్రవహిస్తూ వున్నవి. బరువైన

ఆ కను రెప్పలు ఎత్తి పరీక్షగా ఆ గుడ్డి వెన్నెలలో నా ముఖం చూచింది. కెవ్వుమని కేక పెట్టి అక్కడే మూర్ఛపోయింది. నా ముఖం అంత వికారంగా వుందా? ఆమె నా ముఖం చూస్తే ఏమి విపరీతం జరుగుతుందో అని భయపడుతూ వచ్చిన నేను ఆమెకు అనుకోకుండా చూపించాను.

చూపిస్తే ఏం జరుగుతుందని అనుకున్నానో అంతే జరిగింది. అంతకన్నా ఏమీ విపరీతం జరగకూడదు. నేను జరుగనీయను. ఇదంతా ఎవరూ చూడని విపరీతం. ఆ తోటంతా నాకు తెలిసిందే. అందుకని మంచినీళ్ళ బావి దగ్గరకు వెళ్ళి బొక్కెన నీళ్ళు తెచ్చాను. ఆమె తలను నా ఒళ్ళో పెట్టుకొని కొద్దిగా ముఖంమీద నీళ్ళు జల్లాను. ఆమెకు కొంతసేపటికి తెలివి వచ్చింది. మళ్ళీ కళ్ళు తెరచి 'మీరా' అంటూ వణికిపోతూ కళ్ళు మూసింది. నే నెవర్ని? ఎందుకు కలవరపాటు? నే నేమనుకున్నాను? ఏం జరుగుతూవుంది. ఆమెకు ఏమీ అపకారం జరగకూడదు. ఆమె ఏ పాపం చేయలేదు. భగవంతుని ఒక్కసారి మనస్సులో ప్రార్థించాను.

ఇంటిలోకి వెళ్ళి మా మామగారిని, అత్తగారిని లేపుదామా అంటే, ఇదంతా ఏమిటని? నేను రావటం ఏమిటి? వాళ్ళు ఏమనుకుంటారు. సరోజను ఎట్లా మళ్ళీ మామూలు దానిని చేయాలి? నాకంతా భయంగా, అగమ్య గోచరంగా వుంది. చేతి రుమాలును నీళ్ళలో ముంచి ఆమె ముఖం నెమ్మదిగా తుడిచాను. ఆమెకు ఈసారి పూర్తిగా తెలివి వచ్చింది. "సరోజా! ఎందుకు నీకు భయం? ఇందులో నీ తప్పు ఏముంది. మా నాన్నగారు, మీ నాన్నగారు మన శోభనంతో నా విద్య నాశనం అవుతుందని, ఈ ఏడు పరీక్ష ఫేలవుతానని మనలను ఎడబాటు చేశారు. నీవూ ఒక సామాన్య స్త్రీవే. దేవతవు కావుగా. తప్పు చేయటం మానవులకు సహజం. అయినా నీవు ఇప్పుడు ఏం తప్పు చేశావు సరోజా" అని ఆమె తల నిమురుతూ బుజ్జగించసాగాను. సరోజిని నా రెండు కాళ్ళు గట్టిగా పట్టుకొని ఏదో మాట్లాడబోయింది. కాని నా చేతి వేళ్ళు ఆమె చిన్ని పెదవులకు అడ్డు పెట్టాను.

ఆమెను అసలు మాటలాడనివ్వలేదు. ఆమె సౌభాగ్యంతోటి, సిగ్గుతోటి తల వంచింది. నా బాహువులలో పసిపాపవలె అట్లాగే నిద్రపోయింది. కొంతసేపటికి నా గడియారంవంక చూశాను. అయ్యో! ఎంతో తొందరగా నడిచిపోతూవుంది. మళ్ళీ ఒక్కసారి చిన్ని ముల్లును వెనక్కు తిప్పేద్దామా అని కోపం వచ్చింది. పాడు కాకులు అరుస్తున్నాయే! కోడి 'కొక్కొరో' అంటూవుందే! ఇక లోకం అంతా నిద్రలోంచి లేస్తుందే! "సరోజా" అంటూ ఆమె బుజం తట్టేటప్పటికి ఉలిక్కిపడి లేచింది. సరోజకు జరిగిందంతా కలగా భావించమని బాగా ధైర్యం చెప్పాను. ఆమె చేసిన నేరానికి తగిన శిక్ష కూడా విధించాను. సిగ్గు ముసుగు ఆమె కప్పుకుంది.

"నేను వచ్చానని మామగారికి, అత్తగారికి చెప్పకు సుమా! మీ నౌకరు గౌరి కూడా ఎవరితో చెప్పనందిలే. అయినా సరోజా ఎంత నమ్మకమైన నౌకరిని సంపాదించావు. ఐదు రూపాయలకే లొంగిపోయిందే" అని నవ్వుతూ వున్నాను. సరోజిని కండ్లవెంట బొట బొట నీళ్ళు కారుతున్నాయి. ఆమె మనస్సు మళ్ళీ నొప్పించినందుకు నాకు నిజంగా బాధ కలిగింది. ఆమెను గంటసేపు ఓదార్చి ధైర్యం చెప్పబట్టి మళ్ళీ మామూలు మనిషివలె అయింది. లేకపోతే ఏ విపరీతానికన్నా దారి తీయవచ్చు. "ఏడుస్తున్నావా? పిచ్చిపిల్లా! నవ్వులాటకన్న దానికి ఏడుస్తారా ఏమిటి!" అని ఆమెను బుజ్జగించాను. ఆమె ఒణుకుతున్న స్వరంతో "నన్ను మనసారా క్షమించారా? లేకపోతే నేను—" అని ఏదో అనబోతూవుంది. ఆమెను నేను ఇక మాటలాడనీయలేదు. "నీపై వట్టు సరోజా!" అంటూ చేతిలో చేయి వేశాను. ఆమె ముఖపద్మము ఇప్పుడు వికసించింది. ఆకుల సందులనుంచి పడుతున్న వెన్నెలలో ఆమె కళ్ళు మెరిసాయి. "సరోజా! మళ్ళీ వచ్చే ఆదివారం వస్తాను. మా స్నేహితుని ఒడుగు జరిగింది ఈరోజున. వానిది ఈ ఊరే. అదే ఇదే వంకతో నిన్ను చూడవచ్చుగదా అనుకుని ఇంటికి వస్తూవుంటే గౌరి కనబడింది. తగువాతని" అనేటప్పటికి ఆమె కోమలమైన పొడుగాటి వేళ్ళు నా రెండు పెదవులను ఆడనీయలేదు. చేయి తొలగించి "మరచిపోయేవు సుమా! మళ్ళీ ఆదివారం. రాత్రి పదింటికి ఈ తోటలోకి ఇక్కడికే రావాలి తెలిసిందా?" అంటూ ఆమె చేయి నొక్కి విడిచి పెట్టాను. ఆమె చిన్నగా నవ్వింది. ఆ నవ్వులో ఎంతో తృప్తి, ఆనందం కనబడుతూనే వుంది. కాని వెంటనే అందుకొని "ఏమండోయ్! ఇక దొడ్డిదారి పనికిరాదు. మీరు ఇంక వీధి గుమ్మంలోనుంచే! నన్ను లోబరుచుకున్నాను కదా అని మీ ఆటలు సాగిద్దామనుకున్నారేమో! ఇక మీ ఆటలు ఏమీ సాగవు సుమా!" అని ప్రతిమాట నొక్కి నొక్కి సాగదీసుకుంటూ కిలకిలా నవ్వింది. గుడిలోని గంటలు ఘలు ఘలు మంటూ మోగాయి. ఆమెను చూస్తూ, ఆమె మాటలు వింటూ తెలబోయాను.

★

## శిక్ష

★

జడ్జి: (జూరీతో) ఈ ముద్దాయిమీద రెండు ఖూనీ కేసులు, రెండు దొంగతనాలు రుజువు అయినవి. యితనికి రెండు శిక్షలు ఒకేసారిగా విధించాలి. ఏమిటి మీ వుద్దేశం?

జూరీ: దానికేముంది. ఒకటి—ఉరి తియ్యడం; రెండు యావజ్జీవం కారాగార ప్రాప్తి.

—శ్రీ కె. భైరవమూర్తి

★

## స్వవిషయం

★

ప్రొద్దుటే కావలసినపదార్థాలను టేబిలుమీద సర్దుతూ పనిమనిషి కాస్త కులాసాగా కనపడగానే ఇంటి యజమాని యిలా అన్నాడు:

"ఇవాళ చాలా ఆనందంగా కనిపిస్తున్నావ్" ఏమిటి కథ?

"నిన్న రాత్రి నాట్యానికి వెళ్ళాను. అక్కడ తలుపులు తుడిచే అతనితో కలిసి నాట్యం చేశాను" అందామె.

"భేష్షుగ్గా వుంది! అతని పేరు?"

"నాకు తెలియదు. ఏమైనా స్వవిషయాలు అలాగ నిలబెట్టి అడిగెయ్యటం ఏమంత బాగా లేదండి" అందామె కోపం [illegible].